క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం లో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామికి మంగళ వారం విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

పరవాడ: త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సూచించారు. దేశపాత్రు నిపాలెం జెడ్పీ పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. మార్చి 18 నుంచి జరగనున్న పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని డీఈవో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్.సుజాత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ ఢిల్లీశ్వరి

పరవాడ: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో భద్రం ఫౌండేషన్ కళాజాత బృందం హెచ్ఐవీ– ఎయిడ్స్‌పై ఎన్టీపీసీ కూడలిలో మంగళవారం అవగాహన కల్పించింది. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ జి.ఢిల్లీశ్వరి మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారిపై వివక్షత తగదన్నారు. ఈ వ్యాధులు ఏ విధంగా సంక్రమిస్తాయి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కోదండ, భాస్కరరావు, పైడిరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ దెద్దం ప్రసాదరావు తదితరులు

సబ్బవరం: సబ్బవరం మేజర్ పంచాయతీలోని పాత పోస్టాఫీస్ వీధిలో సీసీ రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. కొల్లివారి ఇళ్ల నుంచి శ్మశానవాటికకు వెళ్లే ఈ రోడ్డు పనులను ఉపసర్పంచ్ మండల లక్ష్మణతో కలిసి సర్పంచ్ దెద్దం ప్రసాదరావు ప్రారంభించారు.రూ.3.5 లక్షల పంచాయతీ నిధులతో ఈ రోడ్డును ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ కొల్లి దేముడమ్మ, గ్రామ పెద్దలు కొల్లి కృష్ణ, టి. శేఖర్,చిత్రాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

18 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: మండంలోని వెన్నలపాలెం, ముత్యాలమ్మపాలెం గ్రామాలకు చెందిన దుంగల నరసింగరావు, చింతకాయల బంగార్రాజు నుంచి 18 మద్యం సీసాలు మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

రామచంద్రమ్మా.. చల్లగచూడమ్మా



- అంబరాన్ని తాకిన రామచంద్రమ్మ సంబరం
- పోటెత్తిన భక్త జనం
- 14 గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి


పోతురాజును దర్శించుకుంటున్న భక్తులు


రామచంద్రమ్మ ఊరేగింపును తిలకిస్తున్న వేలాది మంది భక్తులు (ఇన్‌సెట్) రామచంద్రమ్మ అమ్మవారు

పరవాడ: వాడచీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం రామచంద్రమ్మ అమ్మవారి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 14 గ్రామాల్లో ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది. పండగను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో ముస్తాబు చేశారు. పురవీధులను విద్యుత్ తోరణాలతో అలంకరించారు. మెయిన్ కూడళ్లలో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు, తోరణాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దలాయిపాలెంలో కొలువుదీరిన రామచంద్రమ్మను దర్శించుకోవడానికి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ బారికేడ్లు, షామియానాలు, మంచినీరు, మజ్జిగ, ప్రసాద వితరణ చేపట్టి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. రాత్రికి వాడచీపురుపల్లి సంతబయలులో అమ్మవారిని పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. ఈ మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు.

వెలుగులు.. జిలుగులు

అనంతరం అమ్మవారి అనుపు మహోత్సవంలో భాగంగా భారీ ఎత్తున నిర్వహించిన బాణ సంచా కాల్పులు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ ఘట్టాన్ని వీక్షించడానికి వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చారు. పండగ సందర్భంగా నిర్వహించిన షటిల్, వాలీబాల్, చిడతల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రికి 14 గ్రామాల్లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహోత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు ప్రత్యేక పోలీసు బందోబస్తును నియమించారు. రామచంద్రమ్మ జాతర ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన పోలీసులు, ప్రజలకు ఆలయ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు బురద రాజు, పూజారులు బురద ముత్యాలు, కూండ్రపు అప్పలనాయుడు ధన్యవాదాలు తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక


మంత్రి వేణుగోపాలకృష్ణను సత్కరిస్తున్న రజక సంఘ నేతలు

పరవాడ: రానున్న రోజుల్లో రజకులకు సరైన ప్రాధాన్యం కల్పించాలని విశాఖ జిల్లా రజక సంఘ అధ్యక్షుడు తోకాడ రాము కోరారు. రాజమండ్రిలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను మంగళవారం స్వయంగా కలిసి శాలువతో సత్కరించి వినతి పత్రం సమర్పించారు. రజకులకు మరిన్ని పథకాలు, 50 ఏళ్లకు పెన్షన్ వర్తింపు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, డ్రై క్లీనింగ్ పనులను రజకులకు కేటాయించాలని రాము కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ పొన్నాడ మోహన్‌రావు, అనకాపల్లి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మాస్టారు రాము, పట్నాల ప్రసాద్ పాల్గొన్నారు.

పెందుర్తి తహసీల్దార్‌గా బంగార్రాజు


బంగార్రాజు

పెందుర్తి: మండల తహసీల్దార్‌గా సీహెచ్ బంగార్రాజు నియమితులయ్యారు. బంగార్రాజు ప్రస్తుతం పద్మనాభం మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. పెందుర్తి తహసీల్దార్ ఎస్.వెంకటరావును పద్మనాభం మండలానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ పార్లమెంట్ పరిధిలోని ఎస్.కోట ప్రాంతం బంగార్రాజు స్వస్థలం కావడంతో ఈ బదిలీ చేసినట్టు తెలిసింది. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం పార్లమెంట్ పరిధిలోని స్వస్థలానికి చెందిన అధికారి అదే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పనిచేసే అవకాశం లేదు.

నేత్రపర్వంగా రాములోరి కల్యాణం


స్వామికి యజ్ఞోపవీత ధారణ చేస్తున్న అర్చకులు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు సింహపురికాలనీలోని సీతారామాలయ 21వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సీతారాముల వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాగణంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు, కాలనీవాసులు కల్యాణాన్ని కనులారా తిలకించి భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9.30 నుంచి సుదర్శన నారసింహ హవనం , సాయంత్రం 5గంటల నుంచి ఉత్సవమూర్తులకు గ్రామ తిరువీధి నిర్వహించనున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన


రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: రామ చంద్రమ్మ పండగను పురష్కరించుకొని దలాయిపాలెం ఆలయం వద్ద ఆద్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఆస్పత్రి చైర్మన్ బండారు బాలకృష్ణ మాట్లాడుతూ వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు గోపి, వైద్య నిపుణులు నాయుడు, గోపి, లతా, నాగేశ్వరరావు సేవలందించారని చెప్పారు.

ప్రజల సహకారంతోనే సజావుగా ఎన్నికలు


కన్నూరులో మాట్లాడుతున్న సీఐ బాల సూర్యారావు

పరవాడ: త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని పరవాడ సీఐ ఎస్. బాలసూర్యారావు కోరారు. మండలంలోని కన్నూరు గ్రామంలో పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. అనంతరం ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గొడవలకు తావులేకుండా సమన్వయంతో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ గొల్లవిల్లి నాగమణి, ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రమణ

పైడివాడలో..

సబ్బవరం: మండలంలోని పైడివాడ గ్రామంలో ఎన్నికల నిబంధనలపై గ్రామస్తులకు మంగళవారం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ పిన్నింటి రమణ మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పద్ధతిగా నడుచుకోవాలన్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండడంతో గ్రామాలలో రెచ్చగొట్టే ప్రసంగాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం


ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రపంచంలోనే మహోన్నతమైన భారత రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ అభివృద్ధి చేసుకున్న ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలు మంగళవారం నాటికి 1,111వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పలు విభాగాల కార్మికులు పాల్గొని విశాఖ ఉక్కు –ఆంధ్రుల హక్కు అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ


కరెన్సీ, పూలమాలల అలంకరణలో కొత్తమ్మతల్లి పండ్ల అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం రూ.10, రూ.100 నోట్లు, గజమాలలు, బంతి, చామంతులతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఈ అలంకరణకు కొత్తపేటకు చెందిన రొక్కం శ్రీనివాసరావు, పుష్ప దంపతులు ఆర్థిక సహకారం అందించారు. అమ్మవారిని భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు తదితరులు అలంకరించారు. భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని ఆపిల్, నారింజ, ద్రాక్ష, బత్తాయి, సపోటా, దానిమ్మ, చెర్రీలతో అలంకరించారు. ఈ అలంకరణకు పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ రౌతులపాలెం, రెడ్డివారి కళ్లాలకు చెందిన సిడం పెంటయ్య, అప్పలరాజు దంపతులు సహకరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు


స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై అధిష్టింప జేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అట్టహాసంగా మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం శివారు గణపతిపురంలో శ్రీగణపతి భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రత్యేక పూజలు,హోమాలు చేశారు. అనంతరం పునః మండప పూజ,హోమం వంటి పూజా కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 9:55 గంటలకు శ్రీవిఘ్నేశ్వర భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి,నందీశ్వర,కాలభైరవ నవగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పునం పూజతో కార్యక్రమం ప్రారంభించి ఆయా విగ్రహాలకు మంత్ర స్థాపన,పసిడికలశ స్థాపన,విగ్రహ ఆవిష్కరణ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

3న కోట్నివానిపాలెం రామాలయం ప్రారంభోత్సవం


కోట్నివానిపాలెం రామాలయం ప్రారంభోత్సవానికి స్వామీజీని ఆహ్వానిస్తున్న గ్రామపెద్దలు


తుది మెరుగులు దిద్దుకుంటున్న రామాలయం

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో సీతారాముల ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 3న విగ్రహ యంత్ర, శిఖర ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజలు చేయనున్నారు. ఆదివారం ఉదయం 9.49 గంటలకు విగ్రహ యంత్ర, శిఖర ప్రతిష్ట అనతంరం మధ్యాహ్నం రామాలయం ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం కోలాటాలు, గరిడీలు, మేళతాళాలు, తప్పెటగుళ్లు, మందుగుండు సామగ్రి నడుమ సీతారాముల పల్లకి ఊరేగింపు చేస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రారంభోత్సవానికి శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలతో పాటు పలువురు ప్రముఖులను ఆహ్వానించారు.

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో గురుకుల కన్వీనర్ సత్యారావు

విశాఖ విద్య: చిత్ర లేఖన పోటీల్లో బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని గురుకులాల జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు తెలిపారు. గుంటూరులో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో సింహాచలం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్, ఐదుగురు సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం గురుకులంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ప్రోత్సహించిన డ్రాయింగ్ టీచర్ శ్వేతను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని అవార్డులు సాధించాలన్నారు.

సుస్థిరాభివృద్ధికి సైన్సే సోపానం

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: సుస్థిరమైన భవిష్యత్‌కు శాస్త్రవిజ్ఞానం దోహదపడుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏయూలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా జియోఫిజిక్స్ విభాగంలోని సి.వి.రామన్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం పరిపాలన భవనం వద్ద విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని సైన్స్ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ.. బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి వీసీ మాట్లాడారు. యువత నిరంతర అభ్యాసకులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. యంత్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థగా నేడు ప్రపంచం మార్పు చెందుతోందని, దీనికి అనుగుణంగా యువత సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సునిశిత పరిశీలన, అవగాహన, ఆచరణ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా రంగానికి అపారమైన నిధులు, ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని వెల్లడించారు. కోర్సుల రూపకల్పన, ప్రయోగశాలల ఆధునికీకరణ, ఇంటర్న్‌షిప్‌లు కల్పన, స్టార్టప్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలకు చేపడుతున్నట్లు తెలిపారు. ఎడ్‌ఎక్స్ కోర్సులను రాష్ట్ర యువతకు ఉపయుక్తంగా ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ మాట్లాడుతూ మీ వైఖరులే మీ భవిష్యత్ ప్రగతిని నిర్దేశిస్తాయన్నారు. వర్సిటీ వసతులను సద్వినియోగం చేసుకుంటూ.. ఆలోచనలకు కార్యరూపం ఇవ్వాలన్నారు. మీలోని సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వెలికితీయాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 25కి పైగా పేటెంట్‌లు దాఖలు చేశామని, 82 శాతం విద్యార్థులకు గతేడాది ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఏయూలో 9 ఏళ్లకు పైగా సి.వి రామన్ విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లు అనురాధ కామేశ్వరి, సంధ్య దీపిక, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఏయూ కళాశాలల ప్రిన్సిపాళ్లు వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, ఎస్.కె భట్టి, జి.శశిభూషణ రావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

జీవీఎంసీ దుకాణాలకు బహిరంగ వేలం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–8 (వేపగుంట) పరిధిలో గల జీవీఎంసీ దుకాణాలు, మార్కెట్లను ఏడాది కాల పరిమితికి కాంట్రాక్ట్ ఇచ్చేందుకు మార్చి 2న బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ హైమావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు వేపగుంట జోనల్ కార్యాలయంలో నిబంధనలకు లోబడి కమిషనర్‌చే అనుమతి పొందిన వారితో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలం పాటలో నిబంధనలకు లోబడి పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జోన్–8 కార్యాలయ పని వేళల్లో కార్యాలయ పర్యవేక్షకులను సంప్రదించాలన్నారు.

తప్పుడు వార్తలు నమ్మొద్దు

తాటిచెట్లపాలెం : రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్)లో కానిస్టేబుళ్లు, ఎస్ఐల రిక్రూట్‌మెంట్ పేరిట వివిధ మాధ్యమాల్లో ప్రసారమవుతున్న తప్పుడు వార్తలను నమ్మొద్దని రైల్వే బోర్డు డీఐజీ శ్రీకా మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీయూ ఎగ్జామ్‌నెట్ వెబ్‌సైట్‌లో ఆర్పీఎఫ్‌లో 4208 కానిస్టేబుళ్లు, 452 సబ్ ఇన్‌స్పెక్టర్స్ రిక్రూట్‌మెంట్ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోందని, దీనిలో ఎంతమాత్రం వాస్తవం లేదని తెలిపారు. ఇటువంటి నోటిఫికేషన్ ఏదీ రైల్వే శాఖ జారీ చేయలేదని, ఎవరూ నమ్మొద్దని రైల్వే బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.